# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 256

పేజీలు : 08 | వెల: రూ.5/-

శనివారం

జూలై 12, 2025

www.epaper.warangalvoice.net|www.warangalvoice.net



## నకిలీ సర్టిఫికెట్ల తయారీదారు అరెస్ట్




8లో..

# రెచ్చిపోతున్న గంజాయి గ్యాంగ్స్

- రాత్రి వేళల్లో హల్ చల్
- వాహనదారులను వెంబడించి దాడులు
- నియంత్రించడంలో పోలీసుల విఫలం
- నైట్ పెట్రోలింగ్ లకు మంగళం
- విస్తరిస్తున్న విక్రయాలు



వివరాలు2లో..



అండర్ రైల్వే గేటు ప్రాంతంలో గంజాయి గ్యాంగ్స్ రెచ్చిపోతున్నాయి. ముగ్గురు, నలుగురు గుంపులుగా ఏర్పడి రాత్రి వేళల్లో హల్ చల్ చేస్తున్నారు. వాహనదారులను వెంబడించి దాడులకు పాల్పడుతున్నారు. ఇదేమని ఎవరైనా ప్రశ్నిస్తే వారిపైనే దాడులకు దిగుతున్నారు. నిన్నటికి నిన్న గవిచర్ల క్రాస్ రోడ్ లో 11 మంది యువకులు గంజాయి మత్తులో ఇద్దరిని విచక్షణా రహితంగా కొట్టి పరారయ్యారు. పలువురు మహిళలు సైతం గంజాయి గ్యాంగ్ ఆగడాలకు అవమానాలపాలైన సంఘటనలు ఉన్నాయి. ఇలాంటి సంఘటనలు నిత్యం జరుగుతున్నా పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కేందుకు సాహసించని వారెంతోమంది తమలో తామే కుమిలిపోతున్నారు. గంజాయి గ్యాంగ్ ల అకృత్యాలు అదుపు చేయాల్సిన పోలీసులు చేష్టలుడిగి చూస్తున్నట్లు విమర్శలొస్తున్నాయి. నైట్ ప్రెట్రోలింగ్ లకు పోలీసులు మంగళం పాడడంతో గంజాయి గ్యాంగ్ ల ఇష్టారాజ్యమైంది. ఎవరైనా డయల్ 100 కు ఫోన్ చేసినా స్పందించేవారే కరువయ్యారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే అండర్ రైల్వే గేటు ప్రాంతంలో గంజాయి విక్రయాలు రోజురోజుకూ పెరుగుతున్నా వాటిని అరికట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే చెప్పవచ్చు. బిస్కెట్, చాక్లెట్ లాగా గంజాయి ఎక్కడపడితే అక్కడ లభించడంతో యువత ఈ మత్తులోనే జోగుతున్నారు. పోలీసులకు గంజాయి విక్రయాలు ఎక్కడెక్కడ జరుగుతుందో తెలిసినప్పటికీ మాముళ్ల మత్తులో వాటి జోలికి పోవడంలేదన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని గంజాయి విక్రయాలకు అడ్డుకట్ట వేస్తేనే ఈ గ్యాంగ్ ల ఆటకట్టించడం సాధ్యమవుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

-వరంగల్ వాయిస్ ప్రతినిధి

## కాజీపేటలో జాతీయస్థాయి ఖోఖో పోటీలు

- ఉనికిచర్లలో స్పోర్ట్స్ స్కూల్, మినీ స్టేడియం
- రాష్ట్ర ఖోఖో సంఘం అధ్యక్షులు జంగా రాఘవరెడ్డి



8లో..

8లో..



## ప్రెస్ క్లబ్ లో హెల్త్ క్యాంప్

- ముందస్తుగా రక్త పరీక్షలు
- వీజీఆర్ డయాగ్నస్టిక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు
- ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నాయిని

# రెచ్చిపోతున్న గంజాయి గ్యాంగ్స్



- రాత్రి వేళల్లో హల్ చల్
- వాహనదారులను వెంబడించి దాడులు
- నియంత్రించడంలో పోలీసుల విఫలం
- నైట్ పెట్రోలింగ్ లకు మంగళం
- విస్తరిస్తున్న విక్రయాలు

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** అండర్ రైల్వే గేటు ప్రాంతం గంజాయి విక్రయాలకు అడ్డాగా మారింది. ఒకప్పుడు గుడుంబాకు కేంద్రంగా విరాజిల్లిన అండర్ రైల్వే గేటు ప్రాంతం ఇప్పుడు గంజాయి మత్తులో తూలుతోంది. దుకాణాల్లో చాక్లెట్లు, బిస్కెట్లు కొనుకున్నంత ఈజీగా గంజాయి కొనుగోలు చేస్తున్నారు. విచ్చల విడిగా అమ్మకాలు సాగడంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులనుంచి ముదుసళి వరకు ప్రతీ ఒక్కరు దీనిని కొనుగోలు చేస్తూ అదే మత్తులో తూలుతున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా గంజాయి గమ్మత్తుకు చిత్తు అవుతున్నారు. రాత్రి అయిందంటే చాలు నిర్మానుష్య ప్రాంతాల్లో మూతి మీద మీసం కూడా సరిగా రాని యువకులు సంచరిస్తూ గంజాయిని సేవిస్తున్నారు. అండర్ రైల్వే గేటు పరిధిలోని చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొన్నప్పటికీ ఎవరికి వారు మాకెందుకులే అనుకోవడంతో గంజాయి విక్రయాలు మూడు ప్యాకెట్లు.. ఆరు సిగరెట్లు అన్న చందంగా దినదినాభివృద్ధి చెందుతోంది.

## యువకుల దాడి..

అండర్ రైల్వే గేటు రంగశాయిపేట ప్రాంతంలో గంజాయి మత్తుకు అలవాటు పడిన యువకులు గురువారం రాత్రి రెచ్చిపోయారు. విచక్షణ కోల్పోయి పలువురిపై దాడులకు దిగారు. అర్ధరాత్రి వీరంగం సృష్టించారు. ఇదే ప్రాంతానికి చెందిన కేడల నరేష్, బజ్జూరి వంశీలపై దాడి చేశారు. వారిని చంపేదుకు యత్నించారు. దీంతో నరేష్, వంశీ ప్రాణభయంతో పారిపోయేందుకు ప్రయత్నించినా ఆటోలో వెంబడించి విచక్షణారహితంగా కొట్టి పారిపోయారు. ఇలాంటి సంఘటనలు అండర్ రైల్వే గేటు ప్రాంతంలో నిత్య కృత్యంగా మారాయి. గంజాయి మత్తులో తూలుతున్న కొందరు మహిళలతో కూడా అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. వారిని ఈవ్ టీజింగ్ చేస్తూ లైగింక వేధింపులకు పాల్పడుతున్నారు. అయితే విషయం బయటకు తెలిస్తే రచ్చ అవుతుందన్న భయంతో మహిళలు లోలోపలే మధనపడుతున్నట్లు సమాచారం. బతుకు దెరువు కోసం వివిధ షాపుల్లో పనిచేసి రాత్రి వెళ ఇంటికి వచ్చే మహిళలతో కూడా వీరు అమర్యాదగా వ్యవహరిస్తున్నట్లు పలువరు ఆరోపిస్తున్నారు. దీంతో రాత్రి వేళల్లో మహిళలు ఇంటి నుంచి బయటికి రావాలంటేనే జంకుతున్నారు.

## ప్రేక్షకపాత్ర..


గేటు ఇవతలి ప్రాంతంలో గంజాయి బ్యాచ్ చేస్తున్న ఆడగాలపై పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. గంజాయి అమ్మే వారు, కొనుగోలు చేసే వారి విషయంలో పోలీసులకు స్పష్టత ఉన్నప్పటికీ మామూళ్ల మత్తులో తూలుతూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నట్లు సమాచారం. గురువారం అర్ధరాత్రి గంజాయి బ్యాచ్ దాడిలో తీవ్రంగా గాయపడిన యువకులు మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అయితే గంజాయి బ్యాచ్ ఆగడాలకు బలైనప్పటికీ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయని కేసులు కోకొల్లలుగా ఉంటాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## ఎందుకు ఉదాసీనత..

గంజాయి విక్రయాలపై పోలీసులు ఉదాసీనత ప్రదర్శిస్తున్న ఫిర్యాదులున్నాయి. అండర్ రైల్వే గేటు ప్రాంతంలో ఏరులై పారిన గుడుంబాను అరికట్టడంలో చిత్తశుద్ధి ప్రదర్శించిన పోలీసులు ఇప్పుడు గంజాయి విషయంలో ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని స్తానికులు ప్రశ్నిస్తున్నారు. అయితే అప్పటి చిత్తశుద్ధి కలిగిన పోలీస్ ఆఫీసర్లు ఇప్పుడు లేరా అని నిలదీస్తున్నారు. శివనగర్, ఎస్ఆర్ఆర్ తోట, కరీమాబాద్, బీరన్న కుంట, ఖిలా వరంగల్, రంగశాయిపేట, శంబునిపేట, గవిచరల్ ఇలా అక్కడ, ఇక్కడ అని కాకుండా అన్ని ప్రాంతంలో గంజాయి విక్రయాలు విరివిగా సాగుతున్నా పోలీసులు మాకెందుకులే అన్నట్లు వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గంజాయి విక్రయ దారులను అరికడితే సమస్యకు పరిష్కారం లభించినట్లేనంటున్నారు. ఆ దిశగా పోలీసులు చర్యలు చేపట్టాలంటున్నారు. ఇప్పటికైనా వరంగల్ పోలీస్ కమిషనర్ గంజాయిపై ఉక్కు పాదం మోపేలా చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు. లేకుంటే యువత గంజాయి మత్తులో తూలే పరిస్థితి నెలకొందంటున్నారు.




# చిక్కుల్లో పడొద్దు



**మద్యం సేవించి వాహనాలు నడపొద్దు**

**పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

**వరంగల్ వాయిస్, క్రైం :** మద్యం సేవించి వాహనం నడిపి చిక్కుల్లో పడొద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ వాహనదారులకు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారే ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారన్నారు. అటువంటి ప్రమాదాల్లో వారు స్వయంగా ప్రాణాలు కోల్పోవడం కూడా సంభవిస్తోందన్నారు. రోడ్డు ప్రమాదాలు అనేక కుటుంబాలకు తీరని నష్టాన్ని చూపిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ట్రైసిటీ పరిధిలో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు నిరంతరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్ల పరిధిలో కూడా ఈ తనిఖీలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వాహనదారులకు ముందుగా కమిషనరేట్ కార్యాలయంలోని ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్‌లో కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరడం ద్వారా వారి తప్పిదానికి తగిన శిక్షలు విధించబడుతున్నాయన్నారు. జూలై 5వ తేదీ నుంచి వారం రోజుల్లో జరిగిన తనిఖీల్లో మొత్తం 490 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయన్నారు. ఇందులో 22 మంది వాహనదారులకు కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించగా, మిగితా వాహనదారులు రూ.4,46,800 జరిమానా చెల్లించారన్నారు. ఇందులో హనుమకొండ ట్రాఫిక్ స్టేషన్ పరిధిలో 182 కేసులు నమోదు కాగా, 8మందికి జైలు శిక్ష పడగా రూ.2,05,100 జరిమానాను కోర్టు చెల్లించినట్లు సీపీ తెలిపారు. ఇదే రీతిలో వరంగల్ ట్రాఫిక్ స్టేషన్ పరిధిలో 126 కేసుల్లో తొమ్మిది మందికి జైలు శిక్ష పడగా రూ.1,55,000 జరిమానా, కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 125 కేసుల్లో ఐదుగుకి జైలు శిక్ష పడగా మిగితా కేసుల్లో రూ.1,16,700 జరిమానా చెల్లించారని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా మీ కుటుంబ సభ్యుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనం నడపవద్దంటూ సీపీ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. మీ తప్పిదంతో ఇతరుల ప్రాణాలు పోవచ్చ అన్నారు. కొందరు శాశ్వతంగాను, మరికొందరు జీవితాంతం మానసిక లేదా శారీరక వికలాంగులుగా బాధపడే పరిస్థితి ఎదుర్కొంటారన్నారు. వాహనదారులు మీ గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకోవడమే వరంగల్ పోలీసుల ప్రధాన లక్ష్యం అని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.

# ప్లాస్టిక్ వద్దు.. పేపర్ బ్యాగే ముద్దు

**ఏటా జూలై 12న పేపర్ బ్యాగ్ దినోత్సవం**




**వరంగల్ వాయిస్, వరంగల్ :** భూమిలో త్వరగా కరిగిపోయే పేపర్ బ్యాగ్‌ల పేరు మీద ఓ దినోత్సవాన్ని జరిపే పరిస్థితులు ఈ రోజుల్లో ఉన్నాయి. కారణం కాలుష్యం. ఇందుకు సంబంధించి కొన్ని కఠిన వాస్తవాలు తెలుసుకోవాలి. ప్రతి సంవత్సరం జూలై 12న ప్రపంచ దేశాలన్నీ పేపర్ బ్యాగ్ దినోత్సవాన్ని జరుపుతున్నాయి. తెల్లారింది మొదలు మనం ఏ షాపుకి వెళ్లినా కూరగాయల కోసం, టిఫిన్ల కోసం ప్లాస్టిక్ లేదా పాలిథిన్ కవర్లనే వినియోగిస్తున్నాం. వాడి పారేశాక అవి భూమిలో కరగవు. కొన్ని వేలు, లక్షల సంవత్సరాలు కరగకుండా అలాగే ఉంటాయి. ఫలితంగా సముద్రాలు, నదులు, డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పెరిగిపోతున్నాయి. చివరకు సముద్రాల్లో చేపల కంటే ప్లాస్టిక్ కవర్లే ఎక్కువనే రోజులు వచ్చేలా ఉన్నాయి. ఈ పాలిథిన్ కవర్ల బదులు పేపర్ బ్యాగులు వాడితే బాగుంటుందనే ప్రచారం మొదలైంది. వీటి వల్ల పర్యావరణానికి కాలుష్యం పెద్దగా ఉండదు. పైగా.. ఇవి భూమిలో త్వరగా కరిగిపోతాయి. ప్రతి సంవత్సరం ఈ రోజున స్కూళ్లు, కాలేజీలు, యూనివర్శిటీల్లో పేపర్ బ్యాగుల వాడకంపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే పాలిథిన్ కవర్ల వల్ల కలిగే నష్టాలను వివరిస్తారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రజలను పేపర్ బ్యాగులు వాడమని ప్రోత్సహిస్తాయి. ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాయి. అమెరికాకి చెందిన ఫ్రాన్సిస్ వోల్లే మొదటిసారి పేపర్ బ్యాగ్ యంత్రాన్ని తయారు చేశారు. ఓ రకమైన కలపతో ఈ బ్యాగులను తయారు చేస్తారు. 1871లో మార్గరెట్ నైట్.. మరో యంత్రం చేశారు. అది ఫ్లాట్ బాటమ్ పేపర్ బ్యాగ్స్ తయారు చేసింది. ఆమెను గ్రాసరీ బ్యాగ్ మాతృ మూర్తిగా పిలుస్తారు. ఇలా కాలక్రమంలో రకరకాల యంత్రాలు వచ్చి.. మంచి పేపర్ బ్యాగులు తయారవుతున్నాయి. పేపర్ బ్యాగులు పర్యావరణానికి హాని చెయ్యవు. వీటిని వాడటం చాలా ఈజీ. వీటితో ప్యాకింగ్ తేలిగ్గానే ఉంటుంది. ఇవి చూసేందుకు చాలా అందంగా ఉంటాయి. ఇవి భూమిలో విష వ్యర్థాలను వదలవు. వీటిని వాడేశాక.. న్యూస్ పేపర్లు, మేగజైన్లు, పుస్తకాలుగా రీసైక్లింగ్ చెయ్యవచ్చు. గతేడాది 2022 నాటికి యూజ్ అండ్ త్రో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలంటూ 2017లో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కానీ ఆచరణలో అది అమలు కావడం లేదు. మన దగ్గర మార్కెట్‌లోకి వస్తున్న ప్లాస్టిక్‌లో 80 శాతం తిరిగి సముద్రంలోకి చేరుతుంది. ప్లాస్టిక్ నియంత్రణ, డిస్పోజల్‌కు సరైన పద్ధతులు అమలు చేయకపోవడం వల్ల ఈ సమస్య తలెత్తుతోంది.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ

**కేంద్ర ఎన్నికల కమిషన్ పరిశీలన**




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై కేంద్ర ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ చేపట్టనున్నట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు తెలిపారు. ఆగస్టులో ఓటర్ల జాబితా సవరణని ప్రారంభించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. బీహార్ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై ఇప్పటికే పెద్ద ఎత్తున విమర్శలు, ఆరోపణలు వస్తున్నాయి. ప్రత్యేక సవరణకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూనే ఈసీకి సుప్రీంకోర్టు కొన్ని సూచనలు చేసింది. బీహార్ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరిగే పశ్చిమబెంగాల్, తమిళనాడు తదితర రాష్ట్రాల్లోనూ ఇదే పక్రియను చేపట్టనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్నికలు జరిగే రాష్ట్రాలే కాకుండా దేశ వ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సిద్ధమవుతున్నట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు వెల్లడించింది. ఇందుకు సంబంధించి ఆయా రాష్ట్రాల ఎన్నికల సంఘం అధికారులకు ఇప్పటికే సమాచారం ఇచ్చినట్లు ఈసీ అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి షెడ్యూల్‌ని త్వరలోనే కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.

# నియోజకవర్గానికి ఐరన్ లెగ్ కౌశిక్ రెడ్డి

◆ కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్ విమర్శ

◆ సమష్టిగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపు

**వరంగల్ వాయిస్, కమలాపూర్:** హుజురాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి నియోజకవర్గానికి "ఐరన్ లెగ్" లా మారారని కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్ విమర్శించారు. శనివారం కమలాపూర్ మండల కేంద్రంలో రూ. 8,47,500 లక్షల విలువైన 26 ఇందిరమ్మ ఇళ్ల చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన అనంతరం ప్రణవ్ మీడియాతో మాట్లాడారు. "పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నాం. లబ్ధిదారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సాంకేతిక కారణాల వల్ల ఆగిన వారికి కూడా చెక్కులు అందజేస్తాం" అని ప్రణవ్ స్పష్టం చేశారు. కౌశిక్ రెడ్డి పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని గుర్తించాలని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం తాము గెలిచినా, ఓడినా నిరంతరం పని చేస్తున్నామని ప్రణవ్ పేర్కొన్నారు. హుజురాబాద్ నియోజకవర్గానికి కౌశిక్ రెడ్డి ఐరన్ లెగ్ లాగా తయారయ్యారని, పని చేయడం మానేసి సోషల్ మీడియాలో రీల్స్ చేయడం పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని, గల్లీలో దోస్తీ చేస్తున్నారని, త్వరలో కౌశిక్ రెడ్డి బీజేపీలో చేరినా ఆశ్చర్యపోవద్దని జోస్యం చెప్పారు.

### చెక్కుల పంపిణీపై రాజకీయం తగదు..





రాష్ట్రంలో ఏ ఎమ్మెల్యే కూడా చెక్కుల విషయంలో రాజకీయం చేయలేదని, ఒక్క కౌశిక్ రెడ్డి మాత్రమే పేద ప్రజలకు ఇచ్చే చెక్కుల విషయంలో చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని ప్రణవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కళ్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల విషయంలో డేట్లు అయిపోయిన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తూ వారిని ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. చెక్కులు పంచకుండా ఎమ్మెల్యే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. లబ్ధిదారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అధికారులతో ఇప్పటికే మాట్లాడామని, రీవాలిడేషన్‌తో చెక్కులు ఇస్తామని ప్రణవ్ హామీ ఇచ్చారు. హుజురాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ పెరుగుతోందని, అందుకే ప్రతిపక్ష నాయకులు చిల్లర ఆరోపణలు చేస్తున్నారని ప్రణవ్ అన్నారు. ప్రజా పాలనలో పేద వర్గాలకు, ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందుతుంటే కౌశిక్ రెడ్డి ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. చెక్కుల విషయంలో ఇలాగే చేస్తే తమ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు సమయానికి చెక్కులు పంపిణీ చేస్తారని హెచ్చరించారు.

### కమలాపూర్ కాంగ్రెస్‌లో గ్రూపులు లేవు..

కమలాపూర్ మండల కేంద్రంలో ఎలాంటి గ్రూపులు లేవని, అందరూ కాంగ్రెస్ కుటుంబ సభ్యులేనని వొడితల ప్రణవ్ స్పష్టం చేశారు. పార్టీ లైన్ దాటి ఎవరూ మాట్లాడొద్దని హెచ్చరించారు. ఏదైనా సమస్య ఉంటే పార్టీ ఇంచార్జిగా తన దగ్గరికి తీసుకొస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేసి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఆయన సూచించారు.

# వరంగల్ 'మన అగ్రిటెక్' సేవలు భేష్

◆ జిల్లా వ్యవసాయ అధికారుల ప్రశంస

**వరంగల్ వాయిస్, ఏనుమాముల:** వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో ఆధునిక వ్యవసాయ పరికరాలతో స్థాపించబడిన మన అగ్రిటెక్ సంస్థను నేడు వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారిణి అనురాధ సందర్శించారు. ఆమెతో పాటు ఆమె బృందం కూడా మన అగ్రిటెక్‌లో ఏర్పాటు చేసిన ఒక్కో స్టాల్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సంస్థ అధినేత పాశికంటి రమేష్, స్టాల్స్‌లో ప్రదర్శించిన ఆధునిక వ్యవసాయ పరికరాలు, వాటి పనితీరును అధికారులకు క్లుప్తంగా వివరించారు. గత ఎనిమిది సంవత్సరాలుగా మన అగ్రిటెక్ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను ఛాయాచిత్రాల ద్వారా తెలియజేశారు. రైతుల కోసం అనేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి, ఆధునిక వ్యవసాయంపై వారికి పూర్తి అవగాహన కల్పిస్తున్నామని రమేష్ పేర్కొన్నారు. మునుముందు తాము అందిస్తున్న ఆధునిక వ్యవసాయ పరికరాలకు రైతులకు



కావాల్సిన సబ్సిడీని కల్పించి తోడ్పాటునందించాలని పాషికంటి రమేష్ జిల్లా వ్యవసాయ అధికారులను కోరారు. దీనిపై జిల్లా అధికారిణి అనురాధ సానుకూలంగా స్పందించారు. సంస్థలోని ఉద్యోగులందరినీ చూసిన అనంతరం, రైతులకు కావాల్సిన అన్ని రకాల పరికరాల పట్ల పూర్తి అవగాహన కల్పిస్తూ రైతులకు తోడ్పాటునందించాలని ఆమె కోరారు. మన అగ్రిటెక్ ద్వారా అందిస్తున్న సేవల పట్ల అధికారులు అధినేత పాషికంటి రమేష్‌ను అభినందించారు.

# బీసీ రిజర్వేషన్లపై క్యాబినెట్ తీర్మానాన్ని స్వాగతిస్తున్నాం

◆ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్

**వరంగల్ వాయిస్, బాలసముద్రం:** విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచాలన్న రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాన్ని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ స్వాగతించారు. 2018 పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించి, ఆర్డినెన్స్ ద్వారా బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం అభినందనీయమని ఆయన అన్నారు. ఈ నిర్ణయానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకాటి శ్రీహరి, ఇతర క్యాబినెట్ మంత్రులకు వేణుగోపాల్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో బీసీ సంఘాల నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. గత 18 నెలలుగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వంపై వివిధ రూపాల్లో ఒత్తిడి పెంచుతూ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించామని వేణుగోపాల్ గౌడ్ గుర్తు చేశారు. "గల్లీ నుండి ఢిల్లీ వరకు నిర్వహించిన పోరాట ఫలితమే ఈ 42 శాతం రిజర్వేషన్ల ప్రకటన. ఇది ముమ్మాటికీ బీసీల విజయంగా భావిస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు.బీసీ




రిజర్వేషన్ల బిల్లుకు అగ్రకుల సమాజం సంపూర్ణంగా మద్దతు ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైందని వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అన్నారు. గత ప్రభుత్వంలో బీసీ రిజర్వేషన్లు 34శాతం అమలు కాకుండా కోర్టులను వేదికలుగా చేసుకొని అగ్రకులాలు అడ్డుకున్నాయని, ఇప్పుడు కూడా అదే వైఖరితో వ్యవహరిస్తే బీసీలు కూడా అగ్రవర్ణాలకు కల్పిస్తున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయించాలని రోడ్లపైకి వచ్చి సమరశీల పోరాటాలు చేయాల్సి వస్తుందని ఆయన సున్నితంగా హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దాడి మల్లయ్య యాదవ్, బీసీ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్ డా. చిర్ర రాజు గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు కాసగాని అశోక్, పెరుమాండ్ల అనిల్ గౌడ్, పంజల మధు, తెల్ల కిషోర్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షురాలు మాదం పద్మజ దేవి, బీసీ మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తమ్మేలా శోభరాణి, బీసీ మహిళా జిల్లా నాయకురాలు తెల్ల సుగుణ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి. ఇందులో భాగంగా, వరంగల్ వాయిస్, హనుమకొండ పరిధిలోని 49వ డివిజన్ ప్రకాష్ రెడ్డి పేటలో ఈరోజు 99.70 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సైడ్ డ్రైనేజీ, అంతర్గత రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పనులను నిర్ణీత కాలంలో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ ఏనుగు మానస రామ్ ప్రసాద్, డివిజన్ అధ్యక్షులు కాలువల రాజా మల్లారెడ్డి, కాలనీ పెద్దలు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యానికి ఆర్థిక భరోసా సీఎం రిలీఫ్ ఫండ్



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్:** అనారోగ్యంతో బాధపడుతూ చికిత్సకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నష్కల్ గ్రామానికి చెందిన పాశం అభిలాష్ (యాదగిరి కుమారుడు)కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందింది. ఈ విషయం ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి రావడంతో, హైదరాబాద్‌లోని ఆయన క్వార్టర్స్‌లో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి రూ.1,65,000 విలువైన ఎల్ ఓసీ పత్రాన్ని అభిలాష్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని అన్నారు. ఆరోగ్య శ్రీ పథకంలో వర్తించని వ్యాధులకు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు వైద్య ఖర్చుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా తగిన ఆర్థిక సాయం అందిస్తోందని వివరించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని పేర్కొన్నారు.

# సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం

### బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌పై హర్షం



**వరంగల్ వాయిస్, గణపురం:** తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్స్ తేబోతున్న నేపథ్యంలో గణపురం మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్స్ తేవడం దేశ చరిత్రలోనే ఒక ప్రధాన ఘట్టమని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఈ ఆర్డినెన్స్‌పై హర్షం వ్యక్తం చేస్తుంటే, బీఆర్ఎస్ నాయకులు మాత్రం దీనిని వ్యతిరేకిస్తూ తమ బీసీ వ్యతిరేకతను బయటపెట్టుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులు దుయ్యబట్టారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించే విషయంలో కేంద్రంలోని బీజేపీ మోడీ సర్కారు రాష్ట్రపతి వద్ద జాప్యం చేస్తుండటంతో, బీసీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి సీఎం రేవంత్ రెడ్డి పట్టుదలతో ప్రత్యామ్నాయంగా ఈ ఆర్డినెన్స్ తీసుకువస్తున్నారని వారు గుర్తు చేశారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఆర్. రాజేందర్, నాయకులు వి. కృష్ణ, డి.శంకర్, వి.నారాయణ, ఎం.శివ శంకర్, ఎండీ.చోటే మియా, కే. శ్రీను, కే.కుమార్ యాదవ్, డి.దుర్గయ్య, వి.అశోక్, బి.శంకర్, పి.మహేష్, మల్లికార్జున్, సుందర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్లు, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) భీమారం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఎస్‌వీఎస్ సర్కిల్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జక్కుల భాను ప్రసాద్ మాట్లాడుతూ దాదాపు రూ.7000 కోట్ల రీయింబర్స్‌మెంట్లు, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవడం వల్ల ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులపై ఫీజుల చెల్లింపునకు తీవ్ర ఒత్తిడి తెస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లించని విద్యార్థులను పరీక్షలకు అనుమతించడం లేదని, విద్యా సంవత్సరం పూర్తయినా సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీనిపై విద్యాశాఖ అధికారులు స్పందించడం లేదని ఆయన అన్నారు. దీనివల్ల పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని, ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని భాను ప్రసాద్ పేర్కొన్నారు. వెంటనే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి, పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్లు, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా, హనుమకొండ జిల్లా కేంద్రంలో ప్రధాన విద్యా కేంద్రంగా ఉన్న భీమారంలో పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. భీమారం కేంద్రంలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల అక్రమ దందాలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ భీమారం ఏరియా అధ్యక్ష కార్యదర్శులు బొంకూరి భాను, పి. సుధీర్, భీమారం ఏరియా ఉపాధ్యక్షులు అనిల్ రెడ్డి, అక్షయ్, రాజు, కొట్టే వంశీలతో పాటు పలువురు తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహార కిట్‌ల పంపిణీ




**వరంగల్ వాయిస్, వరంగల్:** సీకేఎం ప్రభుత్వ ఆసుపత్రిలోని ప్రసూతి విభాగంలో రోటరీ క్లబ్ వరంగల్ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహార కిట్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని క్లబ్ అధ్యక్షుడు ఆర్.టి.ఎన్. కె. శివప్రసాద్, కార్యదర్శి ఆర్.టి.ఎన్. ఎల్ల రాజు, కోశాధికారి ఆర్.టి.ఎన్. జి.వేణుగోపాల్, క్లబ్ హెల్త్ సర్వీసెస్ చైర్ పర్సన్ డా.హరి రమాదేవి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంద్రు శ్రీకాంత్, రామగిరి రవీందర్, నాగరాజు, శివ వెంకటేశ్వర్లు, తోట వైద్యనాథ్, మామిడాల సుధాకర్, డాక్టర్ పుష్పేంద్రనాథ్, క్రాంతితో పాటు ఇతర రోటేరియన్లు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** ఇటీవల ఆత్మకూరు మండలం హౌస్ బుజూర్గ్ గ్రామానికి చెందిన పాండవుల రవి భార్య జ్యోతి అనారోగ్యంతో మృతిచెందారు. వారి దశదిన కర్మ సందర్భంగా, మాజీ ఎంపీపీ మార్క సుమలత రజనీకర్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ గ్రామ కార్యకర్తలు శనివారం రవికి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వారు రవి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హిమామ్, గూడెప్పాడ్ మార్కెట్ డైరెక్టర్ నవీర్, గ్రామ పార్టీ అధ్యక్షులు షేక్ ఖాసీం, ప్రధాన కార్యదర్శి దామెర రాజు, ఉపాధ్యక్షులు బషీర్, కుమార, సురేష్, సయ్యద్ మౌలా, బోడిగే రాంబాబు, టీసీ హుస్సేన్ షరీఫ్‌తో పాటు పాల్గొన్నారు.

# అర్హతనే కొలమానంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

◆ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 11, 29వ డివిజన్ల పరిధిలో ఉన్న 39 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పట్టాలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పంపిణీ చేశారు. రామ్మన్నపేటలోని మణిద్వీప్ ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, పశ్చిమ నియోజకవర్గానికి మొత్తం 3500 ఇళ్లను మొదటి విడతలో కేటాయించామని తెలిపారు. అర్హతనే కొలమానంగా తీసుకుని ఎంపిక ప్రక్రియ చేస్తున్నామని, వరంగల్ మండల పరిధిలో ఉన్న రెండు డివిజన్లలో అప్లికేషన్ పెట్టుకున్న వారి జాబితాను పారదర్శకంగా ఎంపిక చేశామని ఆయన చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నారని నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సబ్సిడీ, డ్వాక్రా ద్వారా వీడిలేని రుణాలు వంటి కుటుంబ అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, బ్లాక్ అధ్యక్షులు సంపత్, లక్ష్మారెడ్డి, ఆలయ డైరెక్టర్ పూర్ణ, డివిజన్ అధ్యక్షులు సంగీత్, క్రాంతి, అస్గర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చారిత్రాత్మకం

**కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి**



**వరంగల్ వాయిస్, శాయంపేట:** స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం ఒక చారిత్రాత్మక నిర్ణయం అని, సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. శాయంపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ బీసీ సెల్ మండల పార్టీ అధ్యక్షులు లడే రాజ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బుచ్చిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం హర్షణీయమన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని విమర్శలు చేసినా, స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేసి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కులగణన చేపట్టి రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు వైనాల కుమారస్వామి, చిందం రవి, బాసని శాంత, మార్కండేయ, రఫీ, కుమారస్వామి, మామిడి సుదర్శన్, రాజేందర్, సంపత్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇన్ స్పెక్టర్ షుఖూర్ కు సన్మానం



**వరంగల్ వాయిస్, క్రైం :** కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మక సేవ పతకానికి వరంగల్ ఇంతే జార్ గంజ్ ఇన్ స్పెక్టర్ షుఖూర్ ఎంపికయ్యారు. దీంతె 28 డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన–నవీన్ ఆధ్వర్యంలో శనివారం శాలువతో సత్కరించి పూల మొక్క అందజేశారు. అనంతరం స్వీట్ అందించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ ఇలాంటి పతకాలు మరిన్ని షుఖూర్ సొంతం కావాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా బీజేపీ రజక సెల్ కన్వీనర్ కొత్తపెల్లి రాజేష్, 28 డివిజన్ అధ్యక్షులు రామిని కృష్ణ సుమన్, గన్ను రఘు, వజినపెల్లి సాయి, కలువ మనీష్, శివ తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

● పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, గీసుగొండ :** మండలం కోనాయమాకుల రైతు వేదిక వద్ద పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 15వ, 16వ డివిజన్లతో పాటు గీసుగొండ మండలానికి చెందిన లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి , కళ్యాణ లక్ష్మి పథకాల ద్వారా ఇప్పటివరకు 4030 మంది లబ్ధిదారులకు 27 కోట్ల 63 లక్షల 72 వేల 700 రూపాయలు పంపిణీ చేశామని తెలిపారు. పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం అండగా నిలుస్తుందని, అన్ని వర్గాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఇప్పటివరకు 14 విడతలుగా చెక్కులను పంపిణీ చేశామని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ వారిని సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి పథకాల విషయంలో పక్కన పెట్టేవారని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఆయన వివరించారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య తేడాను ప్రజలు గుర్తించాలని ఆయన కోరారు. గత ఉమ్మడి ఆంధ్ర పాలకుల కంటే ఎక్కువగా కల్వకుంట్ల కుటుంబం దోచుకుందని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు బోగస్ మాటలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని, బీఆర్ఎస్ కుటుంబాన్ని "రాబందుల కుటుంబం"గా అభివర్ణించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియా వేదికగా బీఆర్ఎస్, బీజేపీ నాయకుల అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి నిధులు

◆ రూ 79.50 లక్షల మంజూరుకు కృషి చేసిన ప్రణవ్
◆ మార్కెట్ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్



**వరంగల్ వాయిస్, కమలాపూర్:** జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ నుంచి విడిపోయి స్వతంత్ర మార్కెట్‌గా ఏర్పడిన కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం 79.50 లక్షల నిధులను మంజూరు చేసిందని మార్కెట్ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్ తెలిపారు. కమలాపూర్ మార్కెట్ యార్డులో చైర్మన్ చాంబర్, మీటింగ్ హాల్ లేకపోవడంతో ఇప్పటివరకు సిబ్బంది కార్యాలయంలోనే నూతనంగా ఏర్పడిన మార్కెట్ కమిటీ కార్యకలాపాలు నిర్వహించడం జరిగింది. అంతేకాకుండా, 15 ఎకరాల పరిధి కలిగిన మార్కెట్ చుట్టూ ఉన్న ప్రహరీ గోడ కొంత భాగం వరదల వల్ల కూలిపోయింది. మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో, ఈ సమస్యను హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి ఒడితల ప్రణవ్ బాబు దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ప్రణవ్ బాబు రికమండేషన్‌తో, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఈ నిధులు మంజూరయ్యాయి. నిధుల మంజూరుకు సహకరించిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ గౌడ్‌లకు, నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్ బాబుకు మార్కెట్ పాలకమండలి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని చైర్మన్ ఝాన్సీరాణి రవీందర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్‌తో పాటు డైరెక్టర్లు సముద్రాల కృష్ణ, గట్టు శ్రీధర్, ఆకినపల్లి బిక్షపతి, ఓర్సు తిరుపతి, కెత్తే విజయేందర్, జనగాని శివకృష్ణ, నిగ్గుల లింగయ్య, యాకోబు భాష, చకిలం దయాకర్, కిన్నెర కృష్ణమూర్తి పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య రక్షణ కిట్‌ల పంపిణీ



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య రక్షణకు మహానగరపాలక సంస్థ అందిస్తున్న కిట్‌లు ఎంతో ఉపయోగపడతాయని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. డివిజన్‌లోని ఎస్కే గౌడ్ కళాభవన్‌లో మహానగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఇచ్చిన ఈ కిట్‌లను డివిజన్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులందరికీ కార్పొరేటర్ మరుపల్ల రవి తన చేతుల మీదుగా అందజేశారు. నిత్యం పారిశుద్ధ్య పనులు చేపట్టడం వల్ల అనేకమంది కార్మికులు అనారోగ్యం పాలవుతున్నారని గుర్తించి, మహానగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తరచుగా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి తగిన వైద్యం అందిస్తున్నారని, అలాగే పారిశుద్ధ్య కార్మికులకు కిట్‌లు కూడా ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రతి పారిశుద్ధ్య కార్మికుడు తమ ఆరోగ్య రక్షణ కోసం ఆరోగ్య సూత్రాలు పాటించాలని రవి కోరారు. ఈ కిట్‌ల పంపిణీ కార్యక్రమంలో డివిజన్ ఆఫీసర్ ఎన్. శంకర్, బిల్ కలెక్టర్ పి. రాజ్‌కుమార్, జవాన్లు ఆదామ్, రమేష్, కృష్ణ పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ ఫ్లెక్సీ దహనం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్రంలో విద్యార్థుల సమస్యలను తేలిగ్గా తీసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి సేవాలాల్ సేన గట్టిగానే జులకిచ్చింది. విద్యార్థులకు న్యాయం చేయని సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీని శనివారం కాకతీయ యూనివర్సిటీ గేటు ఎదుట దహనం చేసి తమ ఆగ్రహాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేన హనుమకొండ జిల్లా అధ్యక్షులు కునుసోతు మురళి నాయక్ మాట్లాడుతూ విద్యార్థుల ఓట్లతో గెలిచి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా ఇంకా విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటన్నారు. నెల రోజుల్లోపు స్కాలర్ షిప్ లు, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే హనుమకొండ డీఈఓ, డీఐఈఓ కార్యాలయాలలను ముట్టడిస్తామంటూ హెచ్చరించారు. అనంతరం హైదరాబాద్ గాంధీ భవన్ ముట్టడే లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన వరంగల్ జిల్లా కన్వీనర్ ఇస్లావత్ మోహన్ నాయక్, సేవాలాల్ విద్యార్థి సేన నాయకులు బానోతు సుమన్ నాయక్, ఇస్లావత్ వీరన్న నాయక్, ఇస్లావత్ రాహుల్ నాయక్, ఇస్లావత్ తిరుపతి నాయక్, మూడవత్ ప్రవీణ్ నాయక్ పాల్గొన్నారు.

# దేశంలో ఎమర్జెన్సీని తలదన్నే రీతిలో మోడీ పాలన

◆ మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

**వరంగల్ వాయిస్, కరీంనగర్:** దేశ ప్రజల ప్రజాస్వామిక హక్కులను కాలరాయడంలో నాటి ఎమర్జెన్సీని తలదన్నే రీతిలో నేడు మతం ముసుగులో మోడీ ప్రభుత్వం దుర్మార్గపూరిత పాలన కొనసాగిస్తున్నదని, ఇది దేశానికి చాలా ప్రమాదకరమని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. శనివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ జార్జి రెడ్డి నగర్ (పుష్పావల్లి ఫంక్షన్ హాల్)లో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులు ఘనంగా ప్రారంభమయ్యాయి. క్లాసుల ప్రారంభానికి ముందు పీడీఎస్‌యూ బిగిపిడికిలి జెండాను రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ ఎగురవేశారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ సాయిబోలా విద్యార్థి అమరవీరులను స్మరిస్తూ సంతాపం ప్రకటించారు. ఈ రాష్ట్ర విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను ప్రారంభించిన గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ, నేటి విద్యార్థి, యువత శాస్త్రీయ విజ్ఞానంతో దేశంలో రోజురోజుకు పెరిగిపోతున్న కుల, మతోన్మాద ఫాసిజాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. దేశంలోని విద్యార్థి, యువతకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. సమాజంలో దోపిడీ, పీడన, అణచివేత లేని సమానత్వ సమాజాన్ని స్థాపించుకోవాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర నాయకులు నందిరామయ్య మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వాలు విద్యను వ్యాపారమయం చేశాయని మండిపడ్డారు. పాలకులకు ప్రజల సంక్షేమం పట్ల, దేశాభివృద్ధి పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా, దేశ



పౌరులందరికీ కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్యను అందించాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కాంపాటి పృథ్వీ, ఎస్.అనిల్ లు మాట్లాడుతూ, విద్యారంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువస్తున్న విద్యార్థి వ్యతిరేక సంస్కరణలపై సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మొదటి రోజు జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు రమేష్ "మూఢనమ్మకాలు – సైన్స్" అనే అంశంపై క్లాసును బోధించారు. నేటి సమాజంలో సైన్స్ ప్రాధాన్యతను, మూఢనమ్మకాల వల్ల కలిగే అనర్థాలను క్లుప్తంగా వివరించారు. "విద్యారంగంలో మార్పులు – జాతీయ విద్యా విధానం" అనే అంశంపై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహ రావు, భాస్కర్, ఎర్ర అఖిల్ కుమార్, నరేందర్, సహాయ కార్యదర్శులు సాయి, కర్క గణేష్, వెంకటేష్, రాకేష్, సురేష్, కోశాధికారి మహేందర్, రాష్ట్ర నాయకులు అంగిడి కుమార్, ఎల్. అనిల్, మునిగల శివ, అజయ్, నాగరాజు, అశూర్, హర్షవర్ధన్, వి. కావ్య, దీక్షిత, పి.అనూష, గౌతం, నరేందర్, సీతారామ్, బి. సాయి తదితరులు పాల్గొన్నారు.

# బీసీల పోరాట ఫలితమే రిజర్వేషన్లపై రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం

తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్:** రాష్ట్రవ్యాప్తంగా బీసీలు చేసిన పోరాటాల ఫలితమే స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయమని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు పంచాయతీ రాజ్ చట్టం 2018కి సవరణ చేస్తూ త్వరలో ఆర్డినెన్స్ తీసుకురావాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడం హర్షణీయమన్నారు. ఈ విషయమై ప్రత్యేక చొరవ తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నామని వెంకట్రాములు చెప్పారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని బీజేపీ కేంద్ర మంత్రులు, ఎంపీలు పార్లమెంటు సమావేశాల్లో బిల్లులను ఆమోదింపజేసి తొమ్మిదో షెడ్యూల్లో చేర్చే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిచో బీసీలు తగిన సమయంలో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రాష్ట్రంలో బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేసే విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వాటన్నింటినీ ఎదుర్కోవడానికి, ఇతర డిమాండ్లను సాధించడానికి బీసీలు ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని వెంకట్రాములు ఈ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# మల్లారెడ్డిని సన్మానించిన ప్రణవ్



**వరంగల్ వాయిస్, హుజురాబాద్:** ఇటీవల ఉద్యోగ పదవీ విరమణ పొందిన కటుకూరి మల్లారెడ్డిని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ సన్మానించారు. ఈ సందర్భంగా ప్రణవ్, మల్లారెడ్డి నివాసానికి వెళ్లి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమని ప్రణవ్ పేర్కొన్నారు. మల్లారెడ్డి విద్యా, సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థలో 1992లో ఉద్యోగంలో చేరారని, అసిస్టెంట్ ఇంజినీర్‌గా హుజురాబాద్ ప్రాంతంలో 30 ఏళ్ల పాటు విధులు నిర్వర్తించారని గుర్తు చేశారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పదోన్నతి పొంది సిరిసిల్ల, జగిత్యాల సబ్ డివిజన్లలో పని చేసి జూన్ 30న పదవీ విరమణ పొందారని ప్రణవ్ వివరించారు. జర్నలిజంపై ఉన్న మక్కువతో అంతకుముందు కొన్నేళ్లపాటు రిపోర్టర్‌గా పని చేసి "వార్త మల్లన్న"గా ఈ ప్రాంతానికి సుపరిచితుడయ్యారని ప్రణవ్ అన్నారు. పదవీ విరమణ తర్వాత కూడా ఆయన సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.

# అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఎంబీఏ ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు 15 చివరి తేదీ

**వరంగల్ వాయిస్, వరంగల్:** డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (బీఆర్ఏఓయూ)అందించే ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ కోర్సుల ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి జూలై 15 చివరి తేదీ అని ఓపెన్ వర్సిటీ విద్యార్థి సేవా విభాగం డైరెక్టర్ డా. వై.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో ప్రవేశం పొందాలంటే అభ్యర్థులు ఐసెట్ లో గానీ, లేదా ఓపెన్ యూనివర్సిటీ నిర్వహించే ప్రవేశ పరీక్షలో గానీ తప్పనిసరిగా అర్హత సాధించాలి. డా. బీ.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేయడానికి డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులు సాధించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు తప్పనిసరి అని పేర్కొన్నారు. ఈ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారు అపోలో హాస్పిటల్, కిమ్స్, దక్కన్ మెడికల్ కాలేజీ వంటి సంస్థలలో ఎంబీఏ హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ పొందవచ్చు. అలాగే, యూనివర్సిటీలోని జనరల్ MBA కోర్సులో చేరాలన్నా ఈ ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంటుంది. మరిన్ని వివరాల కోసం www.braouonline.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

# ఉజ్జయిని మహంకాళి బోనాలకు ఏర్పాట్లు

**పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం రేవంత్**

**రాష్ట్రం నలుమూలల నుంచి తరలి రానున్న భక్తులు**



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణలో బోనాల జాతర అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. ఇప్పటికే గోల్కొండ బోనాలు ముగియగా సికింద్రాబాద్ లష్కర్ బోనాల జాతర నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయిన మహంకాళి బోనాలు జరగనున్నాయి. ప్రభుత్వం తరఫున సీఎం రేవంత్ రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. లక్షలాదిమంది భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారం ఉదయం 4.10 బ్రహ్మ ముహూర్తంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆలయ ధర్మకర్త కుటుంబం నుంచి అమ్మవారికి తొలి బోనం సమర్పించనున్నారు. సోమవారం రంగం భవిష్యవాణితో పాటు అమ్మవారి అంబారి ఊరేగింపు, ఆదివారం రాత్రి, సోమవారం రాత్రి  అమ్మవారి ఫలహార బండ్ల ఊరేగింపు ఉంటుంది. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం ఆరు క్యూలైన్ లు ఏర్పాటు చేశారు. బాట షోరూం నుంచి రెండు, రాంగోపాల్ పేట్ పోలీస్ స్టేషన్ నుంచి రెండు, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి మరో రెండు క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్యూ లైన్ లో 16 మీటర్లకు ఒక ఎమర్జెన్సీ గేట్ ఏర్పాటు చేశామన్నారు. భారీ పోలీస్ బందోబస్తుతో పాటు 70 సీసీటీవి కెమెరాల నడుమ బోనాల జాతర జరగనుంది. భక్తులకు ఇబ్బంది కలగకుండా మొబైల్ వాష్ రూమ్స్ ఏర్పాటు చేశారు. ఉదయం వేళల్లో రద్దీ ఉంటుంది కాబట్టి జోగినిలు, శివశక్తులకు దర్శనం చేసుకునేందుకు స్పెషల్ టైం కేటాయించారు. శివ శక్తులు, జోగినిల కోసం మధ్యాహ్నం రెండు గంటల నుంచి 4 గంటల వరకు సమయం కేటాయించారు.

# సీఎం రేవంత్ రెడ్డితో మహేంద్ర దేవ్ భేటీ

**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ఎస్. మహేంద్ర దేవ్ శనివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణను అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లే అంశంపై ఇరువురి మధ్య ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, సమాఖ్య విధానంలో కేంద్రం, రాష్ట్రాలు పరస్పరం గౌరవించుకోవాలని నొక్కి చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా కూడా పాల్గొన్నారు.

# భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

**వరంగల్ వాయిస్, భద్రాచలం :** గోదావరి నది భద్రాచలం వద్ద ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. శనివారం ఉదయానికి నీటిమట్టం 40.5 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో పాటు శబరి నది ఉద్ధృతి కారణంగా గోదావరిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. రెండు రోజుల క్రితం 23 అడుగులు ఉన్న ప్రవాహం ప్రస్తుతం 40.5 అడుగులకు చేరుకుంది. దీంతో స్నానఘట్టాల ప్రాంతంలోని చాలా మెట్లు వరదనీటిలో మునిగిపోయాయి. దుమ్ముగూడెం మండలం పర్ణశాల వద్ద కూడా వరద ఉద్ధృతి కొనసాగుతోంది. సీత వాగు వద్ద నార చీరల ప్రాంతం, సీతమ్మ వారి విగ్రహం వరద నీటిలో మునిగిపోయాయి. గోదావరిలో నీటిమట్టం 43 అడుగులకు చేరితే అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేయనున్నారు.

# రవాణా శాఖలో విప్లవాత్మక మార్పులు

**◆ వాహనాల ఫిట్‌నెస్, డ్రైవింగ్‌పై అవగాహన**

**◆ మంత్రి పొన్నం ప్రభాకర్**



**వరంగల్ వాయిస్, నల్లగొండ :** రాష్ట్ర రవాణా శాఖలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. వాహనాల ఫిట్‌నెస్, డ్రైవింగ్‌పై అవగాహన లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. శనివారం నల్లగొండలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. తెలంగాణలో 17 ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్‌లు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. 15 సంవత్సరాలు దాటిన వాహనాలు స్క్రాప్‌కి వెళ్తున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. రాష్ట్రం వాహన సారథిలోకి ఎంట్రీ అయిందన్నారు. వాహనాల ఫిట్‌నెస్, పొల్యూషన్ అన్నీ వాహన సారథిలో చూసుకోవచ్చని తెలిపారు. ఏఐ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇచ్చేలా చేస్తున్నామని వెల్లడించారు. యాక్సిడెంట్‌లు చేస్తే లైసెన్స్‌లు వెంటనే రద్దు చేస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్, స్క్రాప్ పాలసీ, ఈవీ పాలసీ తీసుకువచ్చామని నొక్కిచెప్పారు. డ్రైవింగ్, ట్రైనింగ్ సెంటర్లు వస్తున్నాయని.. అక్కడ ట్రైనింగ్ తీసుకున్న తర్వాతనే లైసెన్స్‌లు వస్తాయని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. నల్గొండ జిల్లాలో రూ.8 కోట్లతో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇది తెలంగాణలోనే రెండో ఆటోమేటెడ్ టెస్టింగ్ సెంటర్ అని ఉద్ఘాటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో పొన్నం ప్రభాకర్ కేబినెట్‌లో కొట్లాడారని గుర్తుచేశారు. నిజాం కాలంలో మొదటి డిపో నార్కెట్‌పల్లి అని ఇప్పుడు 60 బస్సులు ఉన్నాయని.. ఇంకో 20 బస్సులు కావాలని సూచించారు. నల్లగొండ డిపోను నూతనంగా నిర్మించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.





# న్యాయవాద వృత్తి సవాళ్లతో కూడుకున్నది

- చేసే వృత్తిని, చేసే పనిని ప్రేమించగలగాలి
- కోర్టు తీర్పులపై సమగ్ర అవగాహనతో ఉండాలి
- న్యాయవ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ఇదే ఛాన్స్
- నల్సార్ వర్సిటీ స్నాతకోత్సవంలో సుప్రీం చీఫ్ జస్టిస్ గవాయ్




**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** న్యాయవాద వృత్తి ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. చేసే వృత్తిని, చేసే పనిని ప్రేమించాలని, అప్పుడే సరైన ఫలితాలు పొందగలుగుతామని ఆయన ఉద్ఘాటించారు. ప్రస్తుతం న్యాయవ్యవస్థలో ఎన్నో సవాళ్లు ఉన్నాయని, కొన్ని కేసుల విచారణ దశాబ్దాల పాటు సాగటం ఆందోళనకరమని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీలో శనివారం జరిగిన 22వ స్నాతకోత్సవానికి జస్టిస్ బీఆర్ గవాయ్‌తో పాటు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పీఎస్ నరసింహ, హైకోర్టు సీజే జస్టిస్ సుజయ్ పాల్ తదితరులు హాజరయ్యారు.

**యువ న్యాయవాదులకు సూచనలు.**

ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ, న్యాయవాదులు నిరంతరం తమను తాము నిరూపించుకోవాల్సి ఉంటుందని, కోర్టు తీర్పులపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రస్తుతం న్యాయవాద విద్యలో ప్రవేశించే వారి సంఖ్య పెరుగుతోందని ఆయన అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), డేటా ప్రైవసీ విషయంలో అనుకూల, ప్రతికూల ప్రయోజనాలు ఉన్నాయని, సరైన మార్గదర్శకత్వం ఉంటేనే నైపుణ్యం సాధించగలమని పేర్కొన్నారు. మెంటార్‌షిప్‌ను ఒక బాధ్యతగా భావించాలన్నారు.



**న్యాయవ్యవస్థలో AI ఆవశ్యకత..**

నేటి ప్రపంచంలో న్యాయవ్యవస్థ ముందున్న సవాళ్లను గుర్తు చేసిన జస్టిస్ గవాయ్, మన దేశం వివిధ లీగల్ ఛాలెంజ్‌లను ఎదుర్కొంటోందని అన్నారు. ఇలాంటి సమయంలో, న్యాయవాదులు, న్యాయ సేవలో ఉన్న వారు 'ఎవరేం చెబుతున్నారు' అనే విషయాన్ని క్షుణ్ణంగా వినడం చాలా ముఖ్యమని చెప్పారు. న్యాయవ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించే సమయం ఆసన్నమైందని, సరైన పద్ధతిలో దాన్ని వినియోగించుకుంటే, ఇది తీర్పులను వేగంగా ఇవ్వడంలో దోహదపడుతుందని సీజేఐ పేర్కొన్నారు.

**విదేశీ డిగ్రీలపై హెచ్చరిక..**

విద్యార్థులు, వారి కుటుంబాలు విదేశీ డిగ్రీల కోసం ఆర్థికంగా భారమవ్వకూడదని ఆయన హెచ్చరించారు. మన దేశంలోనే నాణ్యమైన న్యాయ విద్య ఉందని, విదేశీ డిగ్రీల వల్ల మన టాలెంట్ పెరుగుతుందనుకోవడం తప్పని అన్నారు. మన టాలెంట్ మన పనితనంతో నిరూపించుకోవాలని, ఫారిన్ డిగ్రీల కోసమే కుటుంబాలను అప్పుల పాలు చేయడం అవసరం లేదని స్పష్టం చేశారు. మనం ఏ పని చేస్తున్నా, అది ఎంత మనసు పెట్టి చేస్తున్నాం అనేది ముఖ్యమని, న్యాయ రంగంలో విశ్వాసం, నిబద్ధత, ప్రజల సేవకే ముఖ్య ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన యువ న్యాయవాదులకు సందేశమిచ్చారు. ఈ స్నాతకోత్సవం సందర్భంగా డిగ్రీలు అందుకున్న విద్యార్థులు, వారి కుటుంబాల్లో ఉత్సాహం కనిపించింది. ముఖ్య అతిథుల ప్రసంగాలు యువతలో ఆశాభావాన్ని పెంపొందించాయి. నల్సార్ యూనివర్సిటీ తన స్థాయిని నిరూపించుకుంటూ న్యాయవిద్యా రంగంలో దేశానికి ప్రతిభావంతులైన న్యాయవాదులను అందించడంలో ముందుంటుందని చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్ పేర్కొన్నారు.

వరంగల్ వాయిస్ సినిమా
శనివారం 12 జూలై 2025
7

# పూజను వెంటాడుతున్న డిజాస్టర్స్




## ధనుష్ మూవీలో హీరోయిన్ ఛాన్స్ మిస్

ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన అందాల ముద్దుగుమ్మ పూజా హెగ్డే. దక్షిణాదిలోనే కాకుండా బాలీవుడ్‌లో కూడా ఈ అమ్మడు అదరగొట్టింది. ఇండస్ట్రీలో అత్యధిక రెమ్యునరేషన్ అందుకొనే హీరోయిన్లలో ఒకరిగా నిలిచిన ఈ ముద్దుగుమ్మ తన అందం, అభినయంతో ఎంతగానో మెప్పించింది. అరవింద సమేత వీర రాఘవ, మహర్షి, గద్దలకొండ గణేష్, హౌస్‌ఫుల్ 4, అల వైకుంఠపురంలో, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ సినిమాలతో వరుస సక్సెస్ సాధించిన పూజా హెగ్డే ఆ తర్వాత మాత్రం హిట్ కోసం ఎంతో ఎదురు చూసింది. రాధే శ్యామ్ , బీస్ట్, ఆచార్య, సర్కస్, కిసి కా భాయ్, కిసి కీ జాన్, దేవా, రెట్రో సినిమాలు వరుసుగా ఫ్లాప్ అయ్యాయి. ఇటీ–వల వచ్చిన రెట్రో చిత్రంలో డీ గ్లామరైజ్డ్ పాత్ర పోషించగా, దీనిపై కూడా ఎన్నో ఆశలు పెట్టు–కుంది. కాని అది కూడా అభిమానులకు నిరాశను మిగిల్చింది.

తాజాగా ఆమెకు దక్కాల్సిన ఓ క్రేజీ కోలీవుడ్ ఆఫర్ మిస్ అయినట్టు– తెలుస్తుంది. కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ హీరోగా, విగ్నేష్ రాజా దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాలో పూజా హెగ్డేను హీరోయిన్‌గా తీసుకునే యోచనలో ఉండగా, చివరికి ఆమె స్థానంలో మలయాళ బ్యూటీ– మమితా బైజును ఫైనల్ చేశారని వార్తలు వినిపిస్తున్నాయి. మమితా బైజు, 'ప్రేమలు' సినిమా ద్వారా ఫుల్ క్రేజ్ తెచ్చుకుంది. తాజాగా దళపతి విజయ్, సూర్య వంటి టాప్ హీరోల ప్రాజెక్టుల్లో అవకాశాలు దక్కించుకుంటూ, దక్షిణాది చిత్ర పరిశ్రమలో దూసుకుపోతుంది. ఇప్పుడు ధనుష్ సినిమా అవకాశం దక్కడంతో ఆమె కెరీర్ దూసుకుపోయే ఛాన్స్‌లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇదే సమయంలో పూజా హెగ్డే నటించిన చిత్రాలు వరుసగా ఫ్లాప్ అవ్వడంతో ఆమె మార్కెట్‌లో కొంత వెనుకబడినట్లు తెలుస్తోంది. అయితే ఇది తాత్కాలిక మేనని, ఆమె బౌన్స్ బ్యాక్ అయ్యే అవకాశాలు ఉన్నాయని అభిమానులు నమ్ముతున్నారు.అ యితే ఈ ఒక్క సినిమా మిస్ అయినా, పూజా చేతిలో ప్రస్తుతం రజనీకాంత్, విజయ్, రాఘవ లారెన్స్ లాంటి స్టార్ హీరోలతో భారీ ప్రాజెక్టులు చేస్తుంది. ప్రస్తుతం షూటింగ్‌లతో బిజీగా ఉన్న పూజా, త్వరలోనే మళ్లీ ఫాంలోకి వస్తారని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## రామాయణంలో బిగ్ బీ అమితాబ్ వాయిస్ ?


ప్రతిష్ఠాత్మకంగా రానున్న 'రామాయణ' సినిమాకు సంబంధించిన వీడియో ఇటీవల విడుదలైన విషయం తెలిసిందే. ఇందులో నటీనటుల వివరాలు ప్రకటించిన దగ్గరనుంచి సినీ ప్రముఖులు వారి అభిప్రాయాలను తెలుపుతున్నారు. మరోవైపు, ఈ భారీ ప్రాజెక్టులో బాలీవుడ్ అగ్ర నటుడు అమితాబ్ బచ్చన్ కూడా భాగమైనట్లు– తెలుస్తోంది. దీనిపై కథనాలు వెలువడుతున్నాయి. ఇటీవల రూపొందిన 'కల్కి 2998 ఏడీ'లో అశ్వత్థామ పాత్రలో అద్భుతమైన నటనతో ఆశ్చర్యపరిచారు బిగ్ బీ. ఇప్పుడాయన 'రామాయణ'లోనూ భాగం కానున్నట్లు– సమాచారం. ఇందులో జటాయువు పాత్రకు అమితాబ్ వాయిస్‌ఓవర్ ఇవ్వనున్నట్లు– టాక్ వినిపిస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఇందులో రావణుడి పాత్రలో యశ్ కనిపించనున్నారు. దీనిపై బాలీవుడ్ నటు–డు, చిత్ర నిర్మాత రాజ్ బి శెట్టి తన అభిప్రాయాన్ని తెలిపారు. యశ్ ఎంపికపై రాజ్ తన ఇన్‌స్టాలో స్పందించారు. మొదటిసారి ఒక విలన్‌ను కూడా అందరూ మెచ్చుకుంటు–న్నారని అన్నారు. యశ్ ఆ పాత్రలో వందశాతం న్యాయం చేస్తారని తెలిపారు. మనమంతా అతడి కోసం ఎదురుచూడాలని పోస్ట్ పెట్టారు. దీనిపై యశ్ స్పందించారు. 'ధన్యవాదాలు సర్. రామాయణం.. అన్ని భావాలకు అతీతమైన కావ్యం' అని రిప్లై పెట్టారు. ఈ సినిమాలో రాముడి పాత్రలో రణ్‌బీర్ కనిపించనున్న విషయం తెలిసిందే.



## అమెజాన్ ప్రైమ్‌లోకి కుబేర

శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్, నాగార్జున, రష్మిక ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కుబేర' ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా జులై 18 నుంచి స్ట్రీమింగ్ కానుంది. గత కొన్ని రోజులుగా దీని ఓటీటీ– విడుదలపై ఎన్నో వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వాటికి చెక్ పెడుతూ.. తాజాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ అమెజాన్ ఓ పోస్టర్ విడుదల చేసింది. దేశంలోనే అత్యంత సంపన్నుడైన గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ సీఈవో నీరజ్ మిత్ర (జిమ్ సర్బ్) ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా నిలవాలని కలలు కంటుంటాడు. ఆ కల కోసం ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సాగర్ ప్రాజెక్ట్‌ను వినియోగించుకోవాలనుకుంటాడు. రూ.లక్ష కోట్ల డీల్ కుదుర్చుకుంటాడు. ఆ మొత్తం డబ్బులో రూ.50 వేల కోట్లు బ్లాక్‌లో.. మిగిలిన డబ్బు వైట్ లో ఇవ్వాలని నీరజ్‌కు సిద్ధప్ప షరతు విధిస్తాడు. ఈ పనిని సమర్థంగా చేయడం కోసం జైల్లో ఉన్న మాజీ సీబీఐ అధికారి దీపక్ తేజ్ (నాగార్జు) ను బయటకు తీసుకొస్తాడు. ఈ పని కోసం దీపక్ బిచ్చగాళ్లను ఎంచుకుంటాడు. ఈ పని పూర్తి కాగానే ఆ నలుగురు బిచ్చగాళ్లను చంపేయాలని నీరజ్ ప్లాన్ చేయగా.. వారిలో ఒకడైన దేవా (ధనుష్) తప్పించుకుంటాడు. మరి వీళ్ల చేతికి దేవా దొరికాడా? తన ఖాతాలో ఉన్న వేల కోట్ల డబ్బును దేవా ఏం చేశాడన్నది మిగిలిన కథ. శేఖర్ కమ్ముల మూవీ కావడంతో ఆసక్తి పెరిగింది. అయితేఅనుకున్నంతగా ఇది సక్సెస్ సాధించలేదన్నది వేరు విషయం.



## తమన్ స్టూడియోలో ప్రభాస్ సందడి

### రాజాసాబ్ సాంగ్స్ కంపోజింగ్‌పై ఆసక్తి

రెబల్ స్టార్ ప్రభాస్, మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా 'ది రాజా సాబ్'. హార్రర్, కామెడీ, రొమాంటిక్ కథాంశంతో రానున్న ఈ సినిమాలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిధిలు హీరోయిన్లుగా నటిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను పీపుల్స్ మీడియా ఫ్యాక్టరి బ్యానర్ పై విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. తాజాగా రెబల్ స్టార్ ప్రభాస్ తమన్ మ్యూజిక్ సిట్టింగ్స్ లో దిగిన ఫోటో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అయితే తమన్ అందించిన సాంగ్స్ ప్రభాస్ కు నచ్చలేదని అందుకే స్వయంగా డార్లింగ్ దిగాడని కెమెంట్స్ చేస్తున్నారు ఫ్యాన్స్. వాస్తవానికి రాజాసాబ్ సినిమాకు తమన్ ఎప్పుడో సాంగ్స్ కంపోజ్ చేసి ఇచ్చేసాడు. అందులో కొన్ని సాంగ్స్ ను షూట్ కూడా చేసారు. ఆ తర్వాత స్క్రిప్ట్ లో వచ్చిన కొన్ని మార్పుల కారణంగా ముందు కంపోజ్ చేసిన సాంగ్స్ అన్నిటిని పక్కన పెట్టేసారు. ఇప్పుడు మరలా తమన్ తో సాంగ్స్ ను కంపోజ్ చేపిస్తున్నారు. తమన్ అందుకోసం వర్క్ స్టార్ట్ చేసాడు. ఈ నేపథ్యంలోనే తమన్ స్టూడియోకు ప్రభాస్ వెళ్లి సరదాగా కాసేపు ఉండి వచ్చాడు. అంతే తప్ప వర్క్ నచ్చక కాదు. తమన్ వర్క్ పట్ల మారుతీ చాలా అండ్ టీ–మ్ హ్యాపీ గా ఉన్నారు. జెట్ స్పీడ్ లో జరుగుతున్న రాజాసాబ్ ఈ ఏడాది డిసెంబర్ 5న థియేటర్స్ లో అడుగుపెట్టనున్నాడు.

# ప్రెస్ క్లబ్ లో హెల్త్ క్యాంప్

- ముందస్తుగా రక్త పరీక్షలు
- వీబీఆర్ డయాగ్నస్టిక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు
- ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నాయిని



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ సభ్యుల ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్ నకు ముందస్తుగా రక్త పరీక్షలు నిర్వహించారు. హనుమకొండలోని ప్రెస్ క్లబ్ లో శనివారం ఉదయం 7 గంటల నుంచి 9.30 గంటల వరకు వీబీఆర్ డయాగ్నస్టిక్స్ వారి సహాయంతో ఉచిత రక్త పరీక్షలకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం వార్తల సేకరణలో బిజీగా ఉండే జర్నలిస్టులు తమ ఆరోగ్య విషయంలో కూడా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే మనం పలువురికి ఉపయోగపడే వార్తలను అందిచగలమన్నారు. రక్త పరీక్షల రిపోర్టుల ఆధారంగా 13వ తేదీ హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బొల్ల అమర్, కార్యవర్గం పేర్కొంది. ఆదివారం నిర్వహించనున్న మెడికల్ క్యాంప్ లో ప్రముఖ కార్డియాలజిస్టులు డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ వివేక్, డాక్టర్ కూరపాటి మధు, డాక్టర్ అనిల్ రెడ్డి, న్యూరో ఫిజీషియన్లు డాక్టర్ వినయ్ కుమార్ గౌడ్, డాక్టర్ శ్రీచరణ్, డాక్టర్ నర్సింగరావు, గ్యాస్ట్రో, ఫిజీషియన్స్ డాక్టర్ సుమన్, డాక్టర్ వైద్యం గౌతమ్ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్డియాక్ డాక్టర్లతో పాటు ఈసీజీ మెషిన్లు, టూడీ ఈకో మెషిన్ సైతం అందుబాటులో ఉంటాయన్నారు. ప్రెస్ క్లబ్ సభ్యులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని వారు కోరారు.

## 124 మంది రక్త నమూనాల సేకరణ..

గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో సభ్యత్వం కలిగిన 124 మంది రక్త నమూనాలను సేకరించినట్లు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు తెలిపారు. ఆదివారం రానున్న వీరి రిపోర్టుల ఆధారంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బొల్ల అమర్, ఉపాధ్యక్షులు గోకారపు శ్యాం, బొడిగె శ్రీను, కొడిపెల్లి దుర్గాప్రసాద్ రావు, యంసాని శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీలు సంపెట సుధాకర్, పెద్దపెల్లి వరప్రసాద్, పొడిచెట్టి విష్ణువర్ధన్, ఈసీ మెంబర్లు వీరగోని హరీష్, దొమ్మీలు శ్రీకాంత్, జనగాని ఆంజనేయులు, ఎండీ నయీం పాషా, కందుకూరి సంజీవ్, నన్నపనేని భరత్, వివిధ సంఘాల నేతలు గాడిపెల్లి మధు, గడ్డం కేశవమూర్తి, కంకణాల సంతోష్, వల్లాల వెంకటరమణ, తోట సుధాకర్, వర్ధెల్లి లింగయ్య, దుంపల పవన్, అచ్యుత రఘునాథ్, మైదం సుధాకర్, కట్ట రాజు, రామకృష్ణాచారి, ప్రభాకర్, రామాచారి, సాజీద్, టీవీ రాజు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ సర్టిఫికెట్ల తయారీదారు అరెస్ట్

**వరంగల్ వాయిస్, మట్టెవాడ క్రైమ్:** నకిలీ సర్టిఫికెట్లను తయారు చేస్తున్న నల్లవెల్లి అమరేందర్ (35), తండ్రి రాజేశ్వరరావు, నయీంనగర్, హనుమకొండ నివాసిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతడు గత కొన్ని రోజులుగా పోచమ్మ మైదాన్, వేణురావు కాలనీ ఏరియాలో "హనుమాన్ ఆన్‌లైన్ సెంటర్" పేరుతో ఒక దుకాణాన్ని నడుపుతున్నాడు. అమరేందర్ ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులను మోసం చేస్తూ, అధికారుల సంతకాలను ఫోర్జరీ చేస్తున్నాడు. హైదరాబాద్ మున్సిపాలిటీకి చెందిన, వరంగల్ రెవెన్యూ అధికారులకు సంబంధించిన సంతకాలతో రెసిడెన్షియల్, మున్సిపాలిటీ బర్త్ సర్టిఫికెట్లను తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఏజెంట్లను పెట్టుకొని, ఆధార్ కార్డులో మార్పులు చేర్పులు కావాల్సిన ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకుని, అధిక డబ్బులు వసూలు చేసి జననం, నివాస సర్టిఫికెట్లను తయారు చేస్తున్నాడు. అలాగే ఆధార్ సెంటర్ల వారితో కుమ్మక్కై ఆధార్ కార్డులను కూడా తయారు చేస్తుండగా, నమ్మదగిన సమాచారంతో వరంగల్ టాస్క్ ఫోర్స్ అధికారులు, మట్టెవాడ పోలీస్ అధికారులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి అమరేందర్‌ను పట్టుకున్నారు. అమరేందర్ వద్ద నుంచి హైదరాబాద్ మున్సిపాలిటీకి సంబంధించిన ఖాళీ ఫార్మాట్ పేపర్స్, మీసేవ ఫార్మాట్ పేపర్స్ (ముద్రించినవి), ప్రింటర్, కీబోర్డు, రెండు సెల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు ఇలాంటి నకిలీ ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా సంబంధిత అధికారుల ద్వారా మాత్రమే సర్టిఫికెట్లను పొందాలని, లేనిచో ఎవరైనా తప్పు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. అమరేందర్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

# సమాజ సేవలో ఫోరెన్సిక్ వైద్యుల పాత్ర ప్రధానం

**విభాగాధిపతి డాక్టర్ లక్ష్మణ్ రావు**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నేరాల నిరోధంలో, విచారణలో ఫోరెన్సిక్ వైద్యుల పాత్ర ప్రధానమని తెలంగాణ ఫోరెన్సిక్ మెడిసిన్ జనరల్ సెక్రెటరీ, కాకతీయ వైద్య కళాశాల ఫోరెన్సిక్ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ లక్ష్మణరావు అన్నారు. కాకతీయ వైద్య కళాశాల ఎన్ఆర్ఐ భవన్ లో రెండు రోజుల రాష్ట్ర స్థాయి సదస్సు ముగింపు సమావేశం శనివారం సాయంత్రం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ లక్ష్మణ్ రావు మాట్లాడుతూ నేరం జరిగిన ప్రదేశంలో ఆధారాల సేకరణ, నేర సంబందీకుల భౌతిక ఆధారాల సేకరణ, కోర్టుల్లో జరిగే విచారణ ప్రక్రియలో సహాయం అందించడంలో ఫోరెన్సిక్ వైద్యులు సేవలు కీలకంగా మారుతున్నాయన్నారు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో నేరాలను నిరోధించే ప్రక్రియలో కూడా ఈ నిపుణులు తమ సేవలను అందిస్తున్నారని కొనియాడారు. రెండు రోజులపాటు జరిగిన చర్చ, సమావేశాల ద్వారా నైపుణ్యాలను పెంచుకున్న వైద్యులు తమ సేవలకు మరింత పదును పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో కేఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్య, ఫోరెన్సిక్ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అభిజిత్ సుబేదా, ఉస్మానియా ఆస్పత్రి ఫోరెన్సిక్ వైద్యవిభాగాధిపతి డాక్టర్ శ్రీధరరాచారి, గాంధీ ఆస్పత్రి వైద్య విభాగాధిపతి డాక్టర్ కృపాసింగ్, మేజర్ డాక్టర్ నవీన్, కాకతీయ మెడికల్ కళాశాలతో సహ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన ఫోరెన్సిక్ డాక్టర్లు పాల్గొన్నారు. అనంతరం ఫోరెన్సిక్ డాక్టర్ల జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించి పలు తీర్మాణాలు చేశారు.

# కాజీపేటలో జాతీయస్థాయి ఖోఖో పోటీలు



- ఉనికిచర్లలో స్పోర్ట్స్ స్కూల్, మినీ స్టేడియం
- రాష్ట్ర ఖోఖో సంఘం అధ్యక్షులు జంగా రాఘవరెడ్డి

**వరంగల్ వాయిస్, కాజీపేట :** రాష్ట్ర క్రీడా చరిత్రలో తొలిసారిగా సీనియర్ నేషనల్ ఖోఖో ఛాంపియన్ షిప్ కు కాజీపేట ఆతిథ్యమివ్వనున్నట్లు రాష్ట్ర ఖో ఖో అసోసియేషన్ అధ్యక్షులు జంగా రాఘవరెడ్డి తెలిపారు. ఈ మేరకు వరంగల్ జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం హనుమకొండలోని శ్యామల గార్డెన్ లో ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎథిక్స్ కమిటీ కన్వీనర్ గా, సౌత్ జోన్ ఖోఖో అసోసియేషన్ చైర్మన్ గా ఎన్నికైన జంగా రాఘవరెడ్డి, కేకేఎఫ్ఐ ఉపాధ్యక్షులు సీతారాంరెడ్డి, కేకేఎఫ్ఐ కార్యవర్గ సభ్యులు ఎన్.కృష్ణమూర్తి, ప్రసాద్, సౌత్ జోన్ ఖోఖో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన వై.మహేందర్ రావుల సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంతో పాటు దేశంలో క్రమశిక్షణతో కూడిన ఖోఖోను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేయనున్నట్లు చెప్పారు. జాతీయస్థాయి వేదికగా తెలంగాణ క్రీడాకారులు రాణించేందుకు సుమారు రూ. 12 లక్షలతో ఖోఖో మ్యాట్లను అందించినట్లు చెప్పారు. పర్యవసానంగా సబ్ జూనియర్ నేషనన్ లో మన రాష్ట్ర జట్టు రజత పతకం సాధించినట్లు చెప్పారు.

## క్రీడారంగానికి రూ.465 కోట్లు..

గత ప్రభుత్వం క్రీడారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని జంగా రాఘవరెడ్డి ఆరోపించారు. ప్రజా ప్రభుత్వంలో క్రీడా రంగానికి రూ.465 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అదే విధంగా గత ప్రభుత్వం నుంచి క్రీడా సంఘాలకు అందించవలసిన రూ.12 కోట్లను ప్రభుత్వం ద్వారా అందించేందుకు కృషి చేయనున్నట్లు చెప్పారు. ఖోఖో తోపాటు మిగతా క్రీడల అభివృద్ధికై ఉనికికిచర్ల సమీపంలో ఎమ్మెల్యే కడియం సహకారంతో మినీ స్టేడియంతో పాటు క్రీడా పాఠశాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ విషయమై త్వరలో ముఖ్యమంత్రిని క్రీడా సంఘాల ఆధ్వర్యంలో కలవనున్నట్లు చెప్పారు.

## క్రీడాభివృద్ధికీ కృషి..

ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సీతారామిరెడ్డి మాట్లాడుతూ స్వల్ప వ్యవధిలోనే ఖోఖో క్రీడాభివృద్ధికి విషేశంగా కృషి చేసిన జంగా రాఘవరెడ్డి నేతృత్వంలో దక్షిణ భారతదేశంతోపాటు దేశంలో ఖోఖో క్రీడ గణనీయంగా అభివృద్ధి చెందనున్నట్లు చెప్పారు. సమర్థుడైన జంగాకు ఈ పదవి వరించిందన్నారు. జాతీయస్థాయి సీనియర్ ఖోఖో పోటీలు విజయవంతంగా నిర్వహించేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రానికి ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో కీలక పదవులను లభించడం సంతోషదాయకమన్నారు. ఈ స్ఫూర్తితో భవిష్యత్తులో రాష్ట్రంలో ఈ క్రీడ మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. జంగా రాఘవరెడ్డి నేతృత్వంలో జాతీయస్థాయి పోటీలను కనివిని ఎరగని రీతిలో నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం వరంగల్ జిల్లా ఖోఖోఅసోసియేషన్ తో పాటు, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కోకో అసోసియేషన్లు, రాష్ట్ర హ్యాండ్ బాల్, అథ్లెటిక్స్, రెజ్లింగ్, జూడో అసోసియేషన్ ల ఆధ్వర్యంలో జంగా రాఘవరెడ్డిని సన్మాన పత్రాలు, జ్ఞాపికలు అందజేసి గజమాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ ఖోఖోఅసోసియేషన్ ఉపాధ్యక్షులు కత్తి కుమారస్వామి, తెలంగాణ రాష్ట్ర జూడో సంఘం అధ్యక్షులు బి.కైలాస్ యాదవ్, తెలంగాణ అథ్లెటిక్స్, హ్యాండ్ బాల్, రెజ్లింగ్ అసోసియేషన్ ల ప్రధాన కార్యదర్శులు కె.సారంగపాణి, శ్యామల పవన్ కుమార్, మహమ్మద్ కరీం, వరంగల్ జిల్లా క్రీడా సంఘాల బాధ్యులు పి.రమేష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, లిల్లీ ఫ్లోరెన్స్, సాంబశివరావు, ఖోఖో అసోసియేషన్ బాధ్యులు రాజారపు రమేష్, సురేష్, స్వప్న, రమణ పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com